సాక్షి
తూర్పుగోదావరి
సోమవారం । 4 । సెప్టెంబర్ । 2023



రూ.70 వేల విరాళం

ఆత్రేయపురం: వాడపల్లి క్షేత్రంలో నిత్యాన్న దాన భవన నిర్మాణానికి రుద్రరాజు వెంకట సత్యరామకృష్ణరాజు, లక్ష్మి దంపతులు ఆదివారం రూ.70 వేల విరాళం సమర్పించారు.



నిత్యాన్నదానానికి..

అయినవిల్లి: విఘ్నేశ్వర స్వామి ఆలయంలో నిత్యాన్నదానానికి కర్రి కృష్ణారెడ్డి, సూర్య కుమారి దంపతులు (పసలపూడి) ఆదివారం రూ.50 వేల విరాళం సమర్పించారు.

కడలిలోకి 75 వేల క్యూసెక్కులు

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి ఆదివారం 75,386 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. తూర్పు డెల్టాకు 4,800, మధ్య డెల్టాకు 2,500, పశ్చిమ డెల్టాకు 7 వేల చొప్పున డెల్టా కాలువలకు మొత్తం 14,300 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.35 అడుగులకు చేరింది.

భూ వివాదాలు కొలిక్కి

- రీసర్వేతో కొలిక్కి వస్తున్న భూ వివాదాలు
- మొదటి రెండు దశల సర్వే విజయవంతం
- 1,54,956 ఎకరాల్లో భూ సమస్యల పరిష్కారం
- శాశ్వత భూ హక్కు పత్రాల పంపిణీ
- మూడో విడతలో 90 గ్రామాల ఎంపిక
- 1,80,312 ఎకరాల సర్వేకు ప్రణాళికలు



చాగల్లు మండలం కలవలపల్లిలో రీసర్వే చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

సాక్షి, రాజమహేంద్రవరం: భూ వివాదాలకు తెర దించి, శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న 'వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు – భూ రక్ష' పథకం సత్ఫలితాలనిస్తోంది. ఇప్పటికే జిల్లాలో నిర్దేశించిన గ్రామాల్లో మొదటి రెండు దశల్లో రీసర్వే విజయవంతంగా పూర్తయింది. తాజాగా మూడో దశ సర్వే ప్రారంభమైంది. దీనిని యుద్ధప్రాతిపదికన చేపడుతున్నారు. త్వరితగతిన పూర్తి చేసేందుకు అధికారులు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటున్నారు.

జిల్లా వ్యాప్తంగా వివిధ దశల్లో 272 గ్రామాలల్లో రీసర్వే చేపట్టాలని అధికార యంత్రాంగం నిర్ణయించింది. మొదటి విడతగా 45 గ్రామాల్లో 64,438.92 ఎకరాలు, రెండో విడతగా 55 గ్రామాల్లో 90,517.58 ఎకరాల్లో రీసర్వే విజయవంతంగా పూర్తి చేశారు. రీసర్వే పూర్తయిన భూములకు సరిహద్దు రాళ్లు సైతం పాతారు. ఒక్క రూపాయి ఖర్చు లేకుండా.. పక్కా హద్దులతో, వివాదాలకు తావు లేకుండా శాశ్వత భూ హక్కు పత్రాలు అందజేస్తూండటంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం మూడో దశ రీసర్వేకు అంకురార్పణ చేశారు. జిల్లా వ్యాప్తంగా 90 గ్రామాల పరిధిలో 1,80,312.03 ఎకరాల్లో రీసర్వేకు ప్రణాళికలు రూపొందించారు. ఇందుకు అనుగుణంగా పనులు ప్రారంభించారు. ఇప్పటికే సర్వే ప్రారంభించారు.

సర్వే చేస్తున్నారిలా..

మూడో దశ రీసర్వే పకడ్బందీగా నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ భూములు, నివాస గృహాలు, వీధులు, ప్రైవేటు భూములు, పరిశ్రమలు ఇలా గ్రామానికి చెందిన మొత్తం విస్తీర్ణాన్ని సర్వే చేస్తున్నారు. తొలుత గ్రౌండ్ ట్రూతింగ్, గ్రౌండ్ వేలిడేషన్ పూర్తి చేస్తున్నారు. సర్వే చేస్తున్న గ్రామానికి పొరుగున ఉన్న వీఆర్‌ఓలు, గ్రామ సర్వేయర్ల సేవలు వినియోగించుకుంటున్నారు. ప్రతి గట్టూ తిరిగి సరిహద్దులు నిర్ధారిస్తున్నారు. దీనికి ఎక్కువ సమయం పడుతోంది.

అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం

రీసర్వేలో అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నారు. కంటిన్యూస్ ఆపరేటింగ్ రిఫరింగ్ స్టేషన్ నెట్‌వర్క్ సాయంతో ఈ ప్రక్రియ సాగుతోంది. చిన్నచిన్న కమతాల నుంచి భూస్వాముల వరకూ ప్రతీది నమోదు చేస్తున్నారు. మొదటి రెండు దశల్లో మాదిరిగానే డ్రోన్లతో సర్వే చేస్తున్నారు. తద్వారా పారదర్శకతకు పెద్దపీట వేస్తున్నారు.

హద్దు రాళ్లు

సర్వే పూర్తయిన రెవెన్యూ గ్రామాల పరిధిలో ఫ్రీజోన్ యాక్టివిటీస్ కింద భూములకు హద్దులకు సంప్రదాయ పద్ధతిలో సున్నం మార్కింగ్ చేపట్టారు. రాళ్లను మూడు దశల్లో(ఏ,బీ,సీ) విభజించారు. రెండో దశల్లో 15,113 రాళ్లు పాతారు.

వివాదాలకు పరిష్కారం

రీసర్వేతో దశాబ్దం కాలం నాటి భూ వివాదాలకు పరిష్కారం లభిస్తోంది. దశాబ్దం క్రితం నిర్వహించిన సర్వేలో 5 శాతం అలవెన్సు అమలు చేశారు. అప్పట్లో చైన్లతో కొలతలు వేయడంతో భూ విస్తీర్ణంలో 5 శాతం అటూ ఇటుగా సరిహద్దులు నిర్ణయించారు. ఈ క్రమంలో రికార్డుల్లో ఉన్న విస్తీర్ణానికి, భూమి మీద ఉన్న విస్తీర్ణానికి తేడాలు రావడంతో కొందరు రైతులు వాగ్వాదాలకు దిగుతున్నారు. 1906లో నిర్వహించిన సర్వే ఆధారంగానే ప్రస్తుతం భూ సంబంధిత లావాదేవీలు కొనసాగిస్తున్నారు. ఒకే సర్వే నంబరుపై పలుమార్లు లావాదేవీలు జరిగాయి. వారసులు భాగాలు పంపిణీలు చేసుకోవడం, బహుమతిగా ఇవ్వడం, క్రయవిక్రయాలు జరిగినా అందుకు అనుగుణంగా సబ్ డివిజన్ భూమి మీద జరగకపోవడంతో తరచూ సమస్యలు తలెత్తుతున్నాయి. పత్రాల మీద లావాదేవీలు జరిగినా క్షేత్ర స్థాయిలో సర్వే చేయకుండానే నోషనల్ ఖాతాల వల్ల అనేక సమస్యలు మొదలయ్యాయి. తప్పుడు సర్వే నంబర్లతో భూములు రిజిస్ట్రేషన్ కావడం, రిజిస్ట్రేషన్ అయిన భూమికి, వాస్తవంగా భూమి మీద ఉన్న విస్తీర్ణానికి తేడాలు ఉండటం, నిషేధిత భూములు రిజిస్ట్రేషన్ చేయడం వంటి కారణాలతో రెవెన్యూ సమస్యలు నిత్యకృతమయ్యాయి. వీటన్నింటికీ సర్వే పరిష్కారం చూపుతోంది.

రెండు దశల్లో జరిగిన సర్వే వివరాలు

రెవెన్యూ డివిజన్	మొత్తం గ్రామాలు	సర్వే పూర్తయిన విస్తీర్ణం (ఎకరాలు)
మొదటి దశ		
కొవ్వూరు	11	8,256.31
రాజమహేంద్రవరం	34	56,182.61
రెండో దశ		
కొవ్వూరు	30	27,719.86
రాజమహేంద్రవరం	25	62,797.72

ప్రణాళికాబద్ధంగా రీసర్వే



మూడో దశ రీసర్వే ప్రణాళికాబద్ధంగా నిర్వహిస్తున్నాం. కలెక్టర్ కె.మాధవీలత, జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్‌భరత్ ఆదేశాల మేరకు వ్యవహరిస్తున్నాం. ఎలాంటి లోటుపాట్లూ లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. వివాదాల పరిష్కారానికి సలహాలు ఇస్తున్నాం. నిజమైన హక్కుదారుకు న్యాయం చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నాం. సర్వే త్వరితగతిన పూర్తిచేసి లక్ష్యాన్ని అధిగమిస్తాం.

– పి.లక్ష్మణరావు, జిల్లా సర్వే ల్యాండ్ రికార్డ్ అధికారి

జీఓను అతిక్రమిస్తే ఎలా?

- **మెడికల్ అండ్** హెల్త్ ఆర్‌డీకి **డైరెక్టర్ రామిరెడ్డి** ప్రశ్న
- **నిబంధనలకు** నీళ్లొదిలినట్లు **తేలితే చర్యలు** తప్పవని హెచ్చరిక

సాక్షి ఇంపాక్ట్

సాక్షి, రాజమహేంద్రవరం: వైద్య, ఆరోగ్య శాఖ **రాజమహేంద్రవరం జోన్–2 పరిధిలో** జరిగిన **సిబ్బంది సర్దుబాటు బదిలీల్లో** అక్రమాలు **జరిగాయంటూ వచ్చిన ఆరోపణలపై** డైరెక్టర్ ఆఫ్ మెడికల్ అండ్ హెల్త్, ఫ్యామిలీ వెల్ఫేర్ డైరెక్టర్ వి.రామిరెడ్డి సీరియస్ అయ్యారు. ఈ వ్యవహారంపై గత నెల 26న 'సర్దుబాటులో అక్రమాలు' శీర్షికన 'సాక్షి' ప్రచురించిన కథనానికి ఆయన స్పందించారు. స్వయంగా ఆర్డీ కార్యాలయానికి శనివారం వచ్చి విచారణ చేపట్టారు. ఉద్యోగుల బదిలీలపై సుమారు గంట పాటు రీజినల్ డైరెక్టర్ (ఆర్‌డీ) పద్మా శశిధర్‌ను ప్రశ్నించారు. ఈ సందర్భంగా జీవో నిబంధనలకు విరుద్ధంగా సర్దుబాటు చేసిన విషయమై ఆరా తీసినట్లు సమాచారం. 'పీహెచ్‌సీల్లో ఉద్యోగుల సర్దుబాటు నేపథ్యంలో వైద్య, ఆరోగ్య శాఖ వెలువరించిన జీఓ నంబర్ 143 నిబంధనలు అతిక్రమిస్తే ఎలా? ప్రభుత్వం ఏ ఉద్దేశంతో జీఓ ఇచ్చిందో తెలియదా? వాటిపై ఎందుకన్ని ఫిర్యాదులు వస్తున్నాయి?' అని ప్రశ్నించారు. ఓ ఉద్యోగి నకిలీ వ్యాధి నిర్ధారణ పత్రాలు పెట్టి, తాను గతంలో పని చేసిన చోటుకే తిరిగి రావడంపై సైతం ప్రశ్నించినట్లు సమాచారం. దీనిపై ఆర్‌డీ వివరణకు సంతృప్తి చెందని రామిరెడ్డి.. కార్యాలయం అధికారులను, సిబ్బందిని పిలిపించారు. జీఓ ఉల్లంఘించారని తేలితే చర్యలు తప్పవంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. బదిలీలకు వచ్చే ఉద్యోగులను గౌరవించాలని తెలియదా అని ప్రశ్నించారు. ఎలా పడితే అలా మాట్లాడటం కుదరదని, అలాంటి ఘటనలు పునరావృతం కాకూడదని హెచ్చరించారు. ఇదిలా ఉండగా తాము అనుకున్న స్థానాలకు తిరిగి బదిలీ చేయించుకునేందుకు కొందరు యూనియన్ నాయకులు రంగంలోకి దిగారు. ఆర్‌డీ పరిధిలో ఉన్న మొత్తం ఖాళీలు చూపాలని, తమకు కావాల్సిన ప్రాంతాల్లో పోస్టింగ్‌లు ఇవ్వాలని డైరెక్టర్, ఆర్‌డీలను కోరినట్టు తెలిసింది. దీనిక్కి వారిద్దరూ సుముఖత వ్యక్తం చేయకపోవడంతో చేసేది లేక వారు వెనుతిరిగారు.

న్యూస్‌రీల్

రాష్ట్ర ఉత్తమ అధ్యాపకునిగా ఈసూబ్ బాషా



కంబాలచెరువు (రాజమహేంద్రవరం): రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల భౌతిక శాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ ఈసూబ్ బాషా రాష్ట్ర ఉత్తమ అధ్యాపకునిగా ఎంపికయ్యారు. **ప్రిన్సిపాల్** డాక్టర్ కె.రామచంద్రరావు **ఆదివారం ఈ** విషయం తెలిపారు. ప్రభుత్వం **2023 నంవత్సరానికి** అందించే రాష్ట్ర స్థాయి **ఉత్తమ ఉపాధ్యాయ** పురస్కారాన్ని విశాఖపట్నంలో నిర్వహించే కార్యక్రమంలో బాషా అందుకోనున్నారు. ఎన్‌సీసీ అధికారిగా, కళాశాల జేకేసీ నోడల్ కో ఆర్డినేటర్‌గా, విద్యార్థుల కెరీర్ కౌన్సెలింగ్ సమన్వయకర్తగా, ప్లేస్‌మెంట్ అధికారిగా అందించిన సేవలతో పాటు ఉత్తమ బోధనలకు ఆయనను ఈ పురస్కారం వరించింది. బాషాను అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది అభినందించారు.

10 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం

కొవ్వూరు: జిల్లావ్యాప్తంగా ఒక మోస్తరు వర్షం కురిసింది. ఆదివారం ఉదయం 8.30 గంటలతో ముగిసిన 24 గంటల్లో జిల్లాలో 10 మిల్లీ మీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. రాజమహేంద్రవరం రూరల్‌లో గరిష్ఠంగా 57.6 మిల్లీ మీటర్లు రికార్డయ్యింది. కడియంలో 53.6, పెరవలి 27.8, రాజమహేంద్రవరం అర్బన్ 20.4, నిడదవోలు 11.8, ఉండ్రాజవరం 4.8, కొవ్వూరు 1.2, అనపర్తి 5, బిక్కవోలు 2.8, రాజానగరం 4, కోరుకొండలో ఒక మిల్లీమీటర్ చొప్పున వర్షపాతం నమోదైంది.

పాలనలో గ్రామ కార్యదర్శులు కీలకం



సర్టిఫికెట్లు అందజేస్తున్న డీపీఓ సత్యనారాయణ

రాజమహేంద్రవరం రూరల్: శిక్షణతో పని తీరు మెరుగుపరచుకుని, గ్రామ పరిపాలనలో కీలక భూమిక పోషించాలని పంచాయతీ కార్యదర్శులకు జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) జేవీ సత్యనారాయణ సూచించారు. గ్రేడ్–1 నుంచి గ్రేడ్–5 వరకూ పంచాయతీ కార్యదర్శులకు స్థానిక రివర్‌బే హోటల్‌లో ఆరు రోజుల పాటు నిర్వహించిన మొదటి బ్యాచ్ శిక్షణ ఆదివారం ముగిసింది. శిక్షణ పొందిన కార్యదర్శులకు డీపీఓ చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామ పంచాయతీల్లో అనధికార లే అవుట్లు ఎక్కువగా ఏర్పడకుండా ప్రత్యేక చొరవ చూపాలని సూచించారు. పంచాయతీరాజ్ చట్టాలపై అవగాహన పెంచుకోవడం ద్వారా గ్రామస్తులకు సుపరిపాలన అందించాలన్నారు. పంచాయతీల ఆర్థిక పరిపుష్టిలో కార్యదర్శులు కీలకంగా వ్యవహరించాలని చెప్పారు. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థ సహకారంతో గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్య స్థాపనకు కృషి చేయాలని డీపీఓ సత్యనారాయణ సూచించారు. రెండో బ్యాచ్ శిక్షణ సోమవారం ప్రారంభమవుతుందని జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం కో ఆర్డినేటర్ ఆర్మ్‌స్ట్రాంగ్ తెలిపారు. కార్యక్రమంలో మాస్టర్ ఆఫ్ ట్రైనర్లు సరోజిని, మొహిద్దీన్, ఎస్‌కే బాబ్జీ, డీఆర్‌పీలు పాల్గొన్నారు.

భీమేశ్వరాలయంలో అయోధ్య రామయ్య పాదుకలు



అయోధ్య రాముని పాదుకలను దర్శించుకుంటున్న ఈఓ

రామచంద్రపురం రూరల్: అయోధ్య రాముని కోసం రూపొందించిన రజత పాదుకలను ద్రాక్షారామ మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో భక్తుల దర్శనార్థం ఆదివారం ఉంచారు. తొలుత ఆలయ ఈఓ పితాని తారకేశ్వరరావు ఈ పాదుకలను శిరస్సుపై ధరించి డోలు, సన్నాయి మేళంతో ఆలయంలోకి తీసుకు వచ్చారు. అనంతరం అర్చకులు, వేద పండితులు, అభిషేక పురోహితులు, చండీ హోమందారుల సమక్షంలో భక్తులు దర్శనం చేసుకునేందుకు ఏర్పాట్లు చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

23 నుంచి అంతర్వేదిలో పవిత్రోత్సవాలు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని సన్నిధిలో ఈ నెల 23 నుంచి 26వ తేదీ వరకూ పవిత్రోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఏసీ వి.సత్యనారాయణ ఆదివారం తెలిపారు. దేశ ప్రజలు సుఖ శాంతులతో ఉండాలనే ఉద్దేశంతో ఈ ఉత్సవాలు నిర్వహించనున్నామన్నారు.

కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయానికి శంకుస్థాపన



ఆలయ శంకుస్థాపనలో పాల్గొన్న ఎంపీ భరత్‌రామ్, ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

నల్లజర్ల: మండల కేంద్రమైన నల్లజర్లలో రూ.7 కోట్లతో నిర్మించనున్న కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయ శంకుస్థాపన ఆదివారం వైభవంగా జరిగింది. రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్, గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ముఖ్య అతిథులుగా హాజరై, పూజలు, హోమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ భరత్‌రామ్ మాట్లాడుతూ, ఈ ఆలయ నిర్మాణానికి టీటీడీ నుంచి నిధులు మంజూరు చేయించేందుకు సహకరిస్తానని అన్నారు. టీటీడీ బోర్డు సభ్యులు నెరుసు నాగసత్యం మాట్లాడుతూ, బోర్డు తొలి సమావేశంలోనే ఈ ఆలయ ప్రతిపాదన తీసుకువస్తానని చెప్పారు. ఈ ఆలయానికి దాత వీర వెంకట వినోద్ రూ.30 లక్షలు అందజేశారు. ఆహూతులకు దేవాలయ చైర్మన్ రాయుడు విజయకుమార్ స్వాగతం పలికారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ కుమారుడు విశాల్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గగ్గర శ్రీనివాస్, సొసైటీ అధ్యక్షుడు కారుమంచి రమేష్, ద్వారకా తిరుమల పాలక మండలి సభ్యులు ఆచంట అనసూయ, ఎంపీటీసీ సభ్యురాలు మేణ్ని వెంకట లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

లంక భూముల్లో శ్మశాన రాజకీయం

- టీడీపీ నేతపై దళితుల ఆగ్రహం
- పంట భూముల వద్ద పట్టాలతో నిరసన

పెరవలి: ప్రభుత్వం తమకు ఇచ్చిన సి–క్లాస్ లంక భూముల్లో ఓ టీడీపీ నేత శ్మశాన రాజకీయం చేస్తూ, తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారని పలువురు దళితులు ఆందోళన చేశారు. టీడీపీ నేత తీరును నిరసిస్తూ పెరవలి మండలం కానూరు అగ్రహారం వద్ద గోదావరి లంకలోని తమ పంట భూముల వద్ద పట్టాలు చేత పట్టుకుని ఆదివారం వారు నిరసన తెలిపారు. స్థానిక సీసీఎఫ్ సొసైటీ అధ్యక్షుడు కర్సినపు సూర్యారావు కథనం ప్రకారం.. గోదావరి లంకలో 60 ఎకరాల భూమి ఉండేది. ఈ భూములను తాత తండ్రుల నుంచీ అక్కడి దళితులు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఆ భూములపై హక్కు కోసం దళితులందరూ కలసి 1972లో సీసీఎస్ సొసైటీ ఏర్పాటు చేసుకుని, అనేక ఉద్యమాలు చేశారు. దీనిపై 1982లో అప్పటి ప్రభుత్వం స్పందించింది. ఒక్కొక్కరికి 73 సెంట్ల చొప్పున 70 మంది దళితులకు పట్టాలు ఇచ్చింది. అప్పటి నుంచీ సొసైటీ ద్వారా లంక భూములకు రెవెన్యూ పన్ను కట్టి వారు సాగు చేసుకుంటున్నారు. ఇదిలా ఉండగా లంకలోని శ్మశానం భూమిని గ్రామానికి చెందిన టీడీపీ నేత హనుమంతు సుబ్రహ్మణ్యం అనుచరులు ఆక్రమించుకున్నారని, అందులో పంటలు సాగు చేస్తున్నారని దళితులు ఆరోపిస్తున్నారు. ఇప్పుడు అక్కడ శ్మశాన వాటిక ఏర్పాటు పేరుతో తమ భూములపై కన్ను వేసి ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమ భూముల్లో అసలు శ్మశానం లేదని, రికార్డులు పరిశీలిస్తే ఈ విషయం తెలుస్తుందని చెప్పారు. గ్రామంలో ఇప్పటి వరకూ కుల వివక్ష లేదని, కానీ, సుబ్రహ్మణ్యం తీరుతో కుల రాజకీయం మొదలైందని ఆరోపించారు. తమకు కేటాయించిన పంట భూములు తప్ప, ఏనాడూ ఆక్రమణలకు పాల్పడలేదని చెప్పారు. 1982లో 60 ఎకరాల లంక భూమి ఉండగా.. వరదలతో కోతకు గురై నేడు 26.5 ఎకరాలకు కుదించుకుపోయిందని, దీనినే 70 మంది లబ్ధిదారులం పంచుకుని సాగు చేసుకుంటున్నామని తెలిపారు. ప్రభుత్వం తమకు మళ్లీ పట్టాలు ఇస్తూండటంతో సుబ్రహ్మణ్యం కోర్టుకు వెళ్లి శ్మశానం కావాలంటూ స్టే తెచ్చారని, అందుకు తమ భూములు ఎలా ఇస్తామని ప్రశ్నించారు. ఆయన అనుచరుల ఆక్రమణ నుంచి శ్మశాన భూమిని విడిపించి, అందులో శ్మశానం ఏర్పాటు చేయాలని దళితులు కోరారు. సుబ్రహ్మణ్యం నుంచి తమకు రక్షణ కల్పించాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు.



సి–క్లాస్ పట్టాలతో నిరసన తెలుపుతున్న లబ్ధిదారులు

పొజిషన్ ఉన్న వారికే పట్టాలు

జీఓ ప్రకారం సి–క్లాస్ లంక భూముల్లో పొజిషన్ ఉన్న వారికే పట్టాలిస్తాం. కానూరు అగ్రహారంలో శ్మశాన వాటికకు కేటాయించడానికి ఎక్కడా భూమి లేదు. పోరంబోకు స్థలాలుంటే చర్యలు తీసుకుంటాం.

– డి.రాజరాజేశ్వరి, తహసీల్దార్, పెరవలి

రైతు ఇంట కాసుల పంట

- ముగిసిన వర్జీనియా పొగాకు కొనుగోళ్లు
- 55 మిలియన్ల కిలోల పొగాకు ఉత్పత్తి
- రైతులకు రూ.1,349 కోట్ల చెల్లింపు
- కిలో సగటు ధర రూ.245.81
- గరిష్ట ధర రూ.285



దేవరపల్లి వేలం కేంద్రంలో పొగాకు విక్రయాలు (ఫైల్)

దేవరపల్లి: పొగాకు వేలం కేంద్రాల్లో కొనుగోళ్లు ముగిశాయి. పొగాకు బోర్డు పరిధిలో తూర్పు గోదావరి జిల్లా దేవరపల్లి, గోపాలపురంతో పాటు ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంలో రెండు, కొయ్యలగూడెంలో ఒకటి చొప్పున మొత్తం ఐదు వేలం కేంద్రాలున్నాయి. వీటి పరిధిలో రైతులు 2022–23లో పండించిన పొగాకు కొనుగోళ్లు మార్చి 24న ప్రారంభమయ్యాయి. మొత్తం 122 రోజులు కొనుగోళ్లు జరిగాయి. పొగాకు బోర్డు అనుమతించిన దాని కంటే అదనంగా 7 మిలియన్ల కిలోల పొగాకు ఉత్పత్తి జరిగింది. బోర్డు 48 మిలియన్ల కిలోల ఉత్పత్తికి అనుమతి ఇవ్వగా 55.08 మిలియన్ల కిలోలు పండింది.

ఈ ఏడాది పొగాకు పండించిన రైతుల ఇంట కాసుల పంట పండింది. అంతర్జాతీయ మార్కెట్లో వర్జీనియా పొగాకుకు మంచి డిమాండ్ ఏర్పడటంతో ఊహించని ధరలు లభించాయి. వేలం కేంద్రాల్లో ధరలు రికార్డు స్థాయిలో పలికాయి. దీంతో రైతులు ఆర్థికంగా నిలదొక్కున్నారు. రంగు, నాణ్యత, గ్రేడులతో సంబంధం లేకుండా గరిష్ఠ ధరకు పొగాకు అమ్ముడుపోయింది. కిలో గరిష్ఠ ధర రూ.285, సగటు ధర రూ.245.81 చొప్పున రైతులకు లభించింది. ఎకరాకు సుమారు రూ.3 లక్షల ఆదాయం వచ్చిందని పలువురు రైతులు తెలిపారు. ఎకరాకు 10 నుంచి 12 క్వింటాళ్ల దిగుబడులు సాధించారు. దిగుబడులతో పాటు సాగు విస్తీర్ణం పెరగడంతో రైతులకు మంచి ఆదాయం లభించింది.

రూ.1,349 కోట్ల పొగాకు విక్రయాలు

2022–23 పంట కాలంలో రూ.1,349 కోట్ల విలువైన 55.81 మిలియన్ల కిలోల పొగాకు విక్రయాలు జరిగాయని బోర్డు అధికారులు తెలిపారు. మొత్తం ఐదు వేలం కేంద్రాల్లో 14,690 బ్యారన్లు ఉండగా, 12,280 మంది రైతులు, 23,280 హెక్టార్లలో పొగాకు సాగు చేశారు. కిలో గరిష్ఠ ధర రూ.210 తో వేలం ప్రారంభం కాగా, రూ.285 గరిష్ఠ ధరతో అమ్మకాలు ముగిశాయి. నార్తరన్ లైట్ సాయిల్ (ఎన్‌ఎల్‌ఎస్) పొగాకు 55.81 మిలియన్ల కిలోలు, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా తొర్రేడు, రంగంపేట ప్రాంతాల్లో బ్లాక్ సాయిల్ (బీఎస్) పొగాకు 28.18 మిలియన్ల కిలోల చొప్పున ఉత్పత్తి అయ్యింది. బీఎస్ పొగాకు కిలో సగటు ధర రూ.201.44 పలికింది. దీనిని దేవరపల్లి వేలం కేంద్రంలో రైతులు అమ్ముకున్నారు. మొత్తం 1,057 మంది రైతులు, 1,450 హెక్టార్లలో బీఎస్ పొగాకు పండించారు.

పెరగనున్న సాగు విస్తీర్ణం

2023–24 పంట కాలంలో పొగాకు సాగు విస్తీర్ణం గణనీయంగా పెరుగుతుందని అధికారులు, రైతు సంఘాల ప్రతినిధులు అంచనా వేస్తున్నారు. ఈ ఏడాది పొగాకు సాగు లాభసాటిగా ఉండడంతో.. వచ్చే ఏడాది సాగుకు భూములను రైతులు సిద్ధం చేస్తున్నారు. సాగుకు అవసరమైన భూములు, బ్యారన్లను అధిక ధరకు లీజుకు తీసుకుంటున్నారు. పామాయిల్, మామిడి, జీడిమామిడి తోటలు తీసి వేస్తున్నారు. సాగు విస్తీర్ణం 15 వేల నుంచి 20 వేల ఎకరాలు పెరుగుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

వేలం కేంద్రాల వారీగా జరిగిన అమ్మకాలు, సగటు ధర ఈ విధంగా ఉన్నాయి

వేలం కేంద్రం	విక్రయాలు (మిలియన్ కిలోలు)	సగటు ధర (కిలో)
దేవరపల్లి	6.88	254.62
గోపాలపురం	10.60	248.31
జంగారెడ్డిగూడెం–1	12.72	246.36
జంగారెడ్డిగూడెం–2	11.94	248.41
కొయ్యలగూడెం	12.92	245.79
మొత్తం	55.18	145.81

అనుమతి మేరకే ఉత్పత్తి చేయాలి



2023–24 పంట సీజన్‌లో పొగాకు బోర్డు అనుమతించిన మేరకే సాగు చేయాలి. ఈ ఏడాది మార్కెట్లో లభించిన ధరను దృష్టిలో పెట్టుకుని వచ్చే ఏడాదికి పంట సాగు విస్తీర్ణం పెంచితే రైతులు నష్టపోతారు. గిట్టుబాటు ధర రావాలంటే పరిమితికి లోబడి పంట పండించాలి. ఈ ఏడాది పొగాకు కొనుగోళ్లు ముగిశాయి. రైతులకు మంచి ధర లభించింది. లోగ్రేడు పొగాకుకు మంచి డిమాండ్ ఏర్పడింది. ట్రేడర్ల అవసరం మేరకు లోగ్రేడు పొగాకు ఉత్పత్తి కాకపోవడంతో డిమాండ్ ఏర్పడింది.

– ఆదిశేషయ్య, రీజినల్ మేనేజర్, పొగాకు బోర్డు, రాజమహేంద్రవరం

నేటి నుంచి స్కూల్ గేమ్స్

ప్రకాశం నగర్ (రాజమహేంద్రవరం): విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు ప్రభుత్వం ఏటా నిర్వహిస్తున్న స్కూల్ గేమ్స్ పోటీలు సోమవారం ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అధికారులు షెడ్యూల్ ఖరారు చేశారు. ఈ పోటీల్లో పాల్గొనే విద్యార్థులు కచ్చితంగా ఏదైనా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో చదువుతూ ఉండాలి. అండర్–14 నుంచి అండర్–17 విభాగాల్లో విద్యార్థినీ విద్యార్థులకు ఈ పోటీలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా మండల, నియోజకవర్గ స్థాయిల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, త్రోబాల్, టెన్నికాయిట్, యోగా, అథ్లెటిక్స్, షటిల్ బ్యాడ్మింటన్, బాల్ బ్యాడ్మింటన్ పోటీలు, ఎంపికలు నిర్వహిస్తారు. వీటితో పాటు మరో 21 క్రీడాంశాల్లో నేరుగా జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహించనున్నారు. జిల్లా స్థాయిలో ప్రతిభ చూపిన విద్యార్థులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారు. షెడ్యూల్ ప్రకారం ఈ నెల 10వ తేదీలోగా మండల, 11 నుంచి 20 వరకూ నియోజకవర్గ, 21 నుంచి వచ్చే నెల 15వ తేదీలోగా జిల్లా స్థాయి పోటీలు నిర్వహించాల్సి ఉంది. మండల స్థాయిలో నిర్ణీత తేదీల్లో పోటీలు జరపలేకపోతే ఆ మర్నాడు నిర్వహించాల్సి ఉంటుంది. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ద్వారా ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ క్రీడా పోటీలు, ఎంపికలను పారదర్శకంగా నిర్వహించాల్సిందిగా అధికారులకు సూచించామని జిల్లా విద్యా శాఖాధికారి ఎస్.అబ్రహం తెలిపారు.

క్లుప్తంగా

రాతి గట్టును ఢీకొన్న బోట్లు

- సుమారు రూ.12 లక్షల నష్టం



అమీనాబాదు తీరంలో దెబ్బతిన్న బోటు

కొత్తపల్లి: తీర ప్రాంతాల్లో లంగరు వేసిన రెండు బోట్ల తాడ్లు తెగిపోవడంతో శనివారం రాత్రి రాతి గట్టును ఢీకొని ధ్వంసమయ్యాయి. దీంతో సుమారు రూ.12 లక్షల నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు. ఉప్పాడకు చెందిన కారే సత్యం (చిట్టబ్బాయి) తన బోటుపై వేటకు వెళ్లి వచ్చి శనివారం అమీనాబాదు తీర ప్రాంతంలో లంగరు వేశారు. కెరటాలకు లంగరు వేసిన తాడు తెగి బ్యాక్ వాటర్ వాల్‌ను ఢీకొంది. దీంతో బోటు అడుగుభాగం పూర్తిగా ధ్వంసమైంది. జేసీబీ సహాయంతో బోటును తీరానికి చేర్చారు. సుమారు రూ.10 లక్షల వరకూ నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపారు. అలాగే పొన్నాడ శివారు కొనపాపపేటకు చెందిన దూడా సత్తిబాబు తన బోటుపై శనివారం వేట ముగించుకుని కోనపాపపేట తీరప్రాంతంలో లంగరు వేశాడు. లంగరు ఊడి బోటు బీచ్ రోడ్డుకు రక్షణగా వేసిన రాతి గోడను ఢీకొంది. దీంతో బోటు, ఇంజిన్ దెబ్బతినగా సుమారు రూ.2 లక్షల వరకూ నష్టం వాటిల్లింది.

ఆటో, బైక్ ఢీ: యువకుడి మృతి

ఐ.పోలవరం: ఆటో, బైక్ ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. ఐ.పోలవరం మండలం పాత ఇంజరంలో 216 జాతీయ రహదారిపై ఆదివారం ఈ ఘటన చోటు చేసుకుంది. మురమళ్ల నుంచి పాత ఇంజరానికి ఆటో వెళ్తుంది. కొత్త మురమళ్లకు చెందిన లంక సురేంద్ర వంశీశ్రీ (21) యానం నుంచి ఇంటికి బైక్‌పై వస్తున్నాడు. ఈ నేపథ్యంలో బైక్, ఆటో బలంగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో లంక సురేంద్ర వంశీశ్రీ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజేష్ తెలిపారు.

శ్రీ విద్యాసాగర్ సారథ్యంలో GROUP-II కోచింగ్ ప్రారంభం ఈరోజే SATYAM STUDY CIRCLE Opp. More, రామారావుపేట, కాకినాడ 9849238377 9948645434

GROUP-II 2nd Batch 9-9-23 Online / Offline Coaching & Model Exams నిర్వహించబడును. శ్యామ్ కాకినాడ 89847 43999

వీడిన దాంపత్య బంధం

- దైవ దర్శనానికి వెళ్తుండగా ప్రమాదం
- భర్త మృతి, అపస్మారక స్థితిలో భార్య
- పెళ్లయిన నాలుగు నెలలకే విషాదం



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నాగదుర్గ



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సాత్విక



దంపతులు నాగదుర్గ, సాత్విక (ఫైల్)

తుని రూరల్: ఆనందమయ జీవనం.. అన్యోన్య దాంపత్యం.. హాయి హాయిగా సాగిపోతున్న పయనం.. ఇంతలో అనుకోని మలుపు వారి జీవితాన్నే మార్చేసింది.. ఆ దాంపత్య బంధాన్ని వీడదీసింది. దైవ దర్శనానికి దంపతులు వెళ్తుండగా లారీ మృత్యువు రూపంలో దూసుకొచ్చి భర్త మృతికి కారణమైంది. భార్య తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితిలో ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఈ సంఘటన తుని మండలం ఎస్.అన్నవరం శివారు జగన్నాథగిరి జంక్షన్‌లో 16వ నంబరు జాతీయ రహదారిపై జరిగింది. తుని రూరల్ ఎస్సై వి.దేవుడు కథనం ప్రకారం.. ఉప్పాడ కొత్తపల్లి మండలం నాగులాపల్లికి చెందిన కొంతమంది కుటుంబ సభ్యులు లోవ దేవస్థానికి వ్యాన్‌లో బయలుదేరారు. ఇందులో దార్ల నాగదుర్గ (24), అతని భార్య సాత్వికతో కలసి మోటార్ సైకిల్‌పై పయనమయ్యారు. చెట్టాపట్టాలేసుకుని సరదాగా వారు ముందుకు సాగారు. బీచ్ రోడ్డు నుంచి వచ్చిన వీరు తునిలో ఇటీవల కొత్తగా ప్రారంభించిన అండర్‌పాస్ వంతెన మీదుగా జగన్నాథగిరి జంక్షన్‌కు చేరుకున్నారు. అక్కడ బంధువుల వ్యాన్ వెళ్లిన తర్వాత మోటార్ సైకిల్‌పై ఆ దంపతులు హైవేను దాటుతుండగా, అన్నవరం వైపు నుంచి విశాఖపట్నం వెళ్తున్న లారీ ఢీకొంది. దీంతో నాగదుర్గ రోడ్డుపై బలంగా పడిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సాత్విక లారీ టైరులో చిక్కుకోవడంతో కొంత దూరం ఈడ్చుకుపోయింది. దీంతో సాత్విక తీవ్రంగా గాయపడింది. క్షతగాత్రురాలిని 108 అంబులెన్సులో తుని ఏరియా ఆస్పత్రికి తరలించారు. రూరల్ ఏఎస్సై వి.దేవుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నాగదుర్గ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి అనంతరం బంధువులకు అప్పగించారు.

విషాదం నింపిన ప్రమాదం

ఉప్పాడ కొత్తపల్లి మండలం నాగులాపల్లి గ్రామానికి చెందిన దార్ల నాగదుర్గ వాకలపూడి వద్ద కోరమాండల్ ఫెర్టిలైజర్స్ కంపెనీలో కాంట్రాక్టు పద్ధతిలో ఉద్యోగిగా పని చేస్తున్నాడు. సంబంధం కుదరడంతో ఈ ఏడాది మే 10న పామగుంటకు చెందిన సాత్వికను వివాహం చేసుకున్నాడు. వారి వైవాహిక జీవితం సంతోషంగా సాగుతుంది. కుటుంబ సభ్యులంతా సంతోషంగా దైవ దర్శనానికి బయలుదేరిన కొంత సేపటికే మృత్యుశకటంలా వచ్చిన లారీ ఆ కుటుంబంలో పెను విషాదాన్ని మిగిల్చింది. నాగదుర్గ మృతితో పాటు అపస్మారక స్థితిలో ఉన్న సాత్వికను చూసి కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా రోదిస్తున్నారు. నాగదుర్గ, సాత్వికల కుటుంబ సభ్యులు, ఆయా గ్రామస్తులు ఆస్పత్రికి చేరుకోవడంతో ఆ ప్రాంగణంలో విషాదం నెలకొంది.

పిడుగుపాటుకు పశువుల పాకల దగ్ధం



కాలిపోయిన పాకలను పరిశీలిస్తున్న వీఆర్వో పట్టాభి రామారావు తదితరులు

కె.గంగవరం: అముజూరు గ్రామంలో ఆదివారం తెల్లవారు జామున కురిసిన భారీ వర్షానికి పిడుగు పడి మూడు పశువుల పాకలు కాలిపోయాయి. స్థానిక వీఆర్వో పట్టాభి రామారావు కథనం ప్రకారం.. అముజూరు గ్రామానికి చెందిన మేడిశెట్టి ప్రసన్న, మేడిశెట్టి శివప్రసాద్, పెంకే చిట్టియ్యలు అముజూరు–నరజాడ రహదారిలో మెయిన్ రోడ్డు పక్కనే సొంత స్థలంలో పశువుల పాకలు వేసుకుని జీవనం సాగిస్తున్నారు. అక్కడ ఉరుములతో కురిసిన భారీ వర్షానికి చెట్టుపై పిడుగు పడింది. చెట్టు చుట్టూ మంటలు వ్యాపించడంతో కింద ఉన్న ఆ పాకలు కూడా అగ్నికి ఆహుతయ్యాయి. అర్ధరాత్రి సమయంలో వివాహానికి వెళ్లి వస్తున్న కొందరు పిడుగుపాటును గుర్తించి వెంటనే పశువుల పాకల యజమానులకు సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించి మంటలు ఆర్పడానికి ప్రయత్నించారు. కానీ అగ్నికి గాలి తోడవ్వడంతో మూడు పాకలూ పూర్తిగా కాలిపోయాయి. పాకలలో ఉన్న ఒక గేదె, దూడ మృతి చెందగా, మరో పాడి గేదె, దూడలకు 80 శాతం గాయాలయ్యాయి. వీటికి పామర్రు పశు వైద్యాధికారి బిందు చికిత్స చేశారు. ఆమె సమాచారంతో డీఏహెచ్ఓ కె.వెంకటరావు సంఘటనా స్థలానికి వచ్చి పరిస్థితిని పరిశీలించారు. ప్రభుత్వం నుంచి సాయం అందించేలా జిల్లా కలెక్టర్‌కు సిఫార్సు చేస్తామని పాడి రైతులకు హామీ ఇచ్చారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.3 లక్షల వరకూ ఆస్తి నష్టం ఉంటుందని వీఆర్వో తెలిపారు.

కాలువలో పడి వివాహిత ఆత్మహత్య



మృతురాలు కరణం రమాదేవి (ఫైల్)

కిర్లంపూడి: కాలువలో పడి ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటనపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై పి.ఉమా మహేశ్వరరావు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. వేలంక గ్రామానికి చెందిన కరణం రమాదేవి (28)కి పదేళ్ల కిందట బూరుగుపూడికి చెందిన కరణం లోవఅబ్బాయితో వివాహం జరిగింది. వీరికి ముఖేష్, బాల వెంకటేశ్ ఇద్దరు కుమారులు. కొంత కాలంగా భర్త మద్యానికి బానిసై ఇంటికి వస్తుండటంతో తరచూ భార్యాభర్తలు గొడవ పడేవారు. తన భర్తలో ఎటువంటి మార్పు రాకపోవడంతో రామాదేవి తీవ్ర మనస్తాపానికి గురైంది. రెండు రోజుల కిందట తన తల్లి ఇంటికి వెళతానని చెప్పి వెళ్లి కనిపించకపోవడంతో బంధువులు ఇచ్చిన ఫిర్యాదుతో శనివారం అర్ధరాత్రి పోలీసులు కేసు నమోదు చేశారు. ఆదివారం జగ్గంపేట మండలం రామవరం సమీపంలోని పోలవరం కాలువలో రామాదేవి మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై ఉమా మహేశ్వరరావు తెలిపారు. మృతురాలి తల్లి పెద్దిరెడ్డి లోవలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

విద్యుదాఘాతంతో కూలీ మృతి




మృతి చెందిన సుంకర త్రిమూర్తులు

అల్లవరం: రొయ్యల చెరువు వద్ద విద్యుదాఘాతానికి గురై ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. భీమవరానికి చెందిన ఆక్వా రైతు కలిదిండి శ్రీనివాసరాజుకు మండలంలోని ఎస్.పల్లిపాలెంలో రొయ్యల చెరువు ఉంది. అక్కడ రోజు వారీ కూలీగా సామంతకుర్రు గ్రామానికి చెందిన సుంకర త్రిమూర్తులు (57) పని చేస్తున్నారు. ఈ చెరువులో ఆక్సిజన్ కోసం ఏర్పాటు చేసిన ఏరియేటర్ ఆగిపోయింది. కరెంట్ ఉన్నా ఏరియేటర్ తిరగకపోవడంతో త్రిమూర్తులు చెరువులోకి దిగి ఎందుకు తిరగడం లేదోనని పరిశీలించే ప్రయత్నం చేశాడు. అయితే ఏరియేటర్‌లోని విద్యుత్ మోటార్ హైపవర్‌కు కాలిపోయి విద్యుత్ సర్క్యూట్ అవుతుంది. ఇది గమనించని త్రిమూర్తులు విద్యుత్ మోటార్‌ను పట్టుకోగా షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. పక్కనే పనిచేస్తున్న కూలీలు గుర్తించి పరుగు పరుగున వచ్చి విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. అయితే అప్పటికే త్రిమూర్తులు మృతి చెందారు. విద్యుత్ షాక్‌కు గురైన త్రిమూర్తులును ఒడ్డుకు చేర్చి పోలీసులకు సమాచారం అందించారు. అల్లవరం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని బాధితుల నుంచి వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

9న బాస్కెట్‌బాల్ క్రీడాకారుల ఎంపిక

పిఠాపురం: విజయవాడలో ఈ నెల 11, 12 తేదీల్లో నిర్వహించే జిల్లా స్థాయి త్రి ఇన్ టూ త్రి మహిళల, పురుషుల బాస్కెట్‌బాల్ చాంపియన్ షిప్‌కు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జట్ల ఎంపిక ఈ నెల 9న రామచంద్రపురంలో నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని ఆదివారం జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి బొజ్జా మాణిక్యాలరావు తెలిపారు. విజయవాడలోని స్టెల్లా కాలేజీలో ఈ పోటీలు జరుగుతాయన్నారు. ఈ నెల 29 నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకూ మార్టేరులో నిర్వహించే రాష్ట్ర స్థాయి త్రి ఇన్ టూ త్రి మహిళల, పురుషుల బాస్కెట్‌బాల్ చాంపియన్ షిప్‌కు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జట్ల ఎంపిక ఈ నెల 10న రామచంద్రపురంలో నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

వ్యాన్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు



బోల్తా పడిన వ్యాన్, పక్కన బస్సు



108లో క్షతగాత్రులను ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం

- ఐదుగురికి గాయాలు

రాజానగరం: పలాస నుంచి భద్రాచలానికి 37 మంది ప్రయాణికులతో వెళ్తున్న ఆర్టీసీ బస్సు ముందు వెళ్తున్న ఐషర్ వ్యాన్‌ను ఢీకొంది. బస్సు రహదారి దిగువకు ఒరిగి పోగా, వ్యాన్ బోల్తా పడింది. జాతీయ రహదారిపై దివాన్‌చెరువు వద్ద ఆదివారం తెల్లవారు జామున జరిగిన ఈ ప్రమాదంతో బస్సులోని ఐదుగురికి గాయాలయ్యాయి. బొమ్మూరు పోలీసుల కథనం ప్రకారం.. పలాస ఆర్టీసీ డిపో నుంచి భద్రాచలానికి శనివారం రాత్రి బయలుదేరిన ఎక్స్‌ప్రెస్ బస్సు దివాన్‌చెరువు వద్దకు వచ్చే సరికి అనకాపల్లి నుంచి సూర్యాపేటకు కర్రల లోడుతో వెళ్తున్న ఐషర్ వ్యాన్‌ని అధిగమించే ప్రయత్నం చేసి ఢీకొంది. ఈ సంఘటనలో గాయపడిన ఐదుగురిని చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బస్సు డ్రైవర్ గుణశౌరి విజయకుమార్ కాలికి తీవ్ర గాయం కావడంతో చికిత్స పొందుతుండగా, మిగిలిన నలుగురికి ప్రాథమిక చికిత్స అందించి పంపించి వేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు బొమ్మూరు ఎస్సై జగన్ మోహనరావు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

ధవళేశ్వరం: స్థానిక హార్లిక్స్ ఫ్యాక్టరీ సమీపంలోని రైలు పట్టాల వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని ఆదివారం రైల్వే పోలీసులు గుర్తించారు. అతడి వయసు సుమారు 35 నుంచి 40 ఏళ్ల మధ్య ఉంటుంది. నలుపు రంగు టీషర్ట్, ఎరుపు రంగు నిక్కరు ధరించి ఉన్నాడు. కుడి చేతికి పన్నెండు రాఖీలు కట్టి ఉన్నాయి. అతడు రైలు నుంచి జారిపడి మృతి చెంది ఉండవచ్చని రైల్వే పోలీసులు భావిస్తున్నారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు రాజమహేంద్రవరం రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వాలని రైల్వే ఎస్సై లోవరాజు కోరారు.

ఈత సరదా తీసింది ప్రాణం



తరుణ్‌కుమార్ మృతదేహం

గండేపల్లి: ఈత సరదా ఓ యువకుడి ప్రాణం తీసింది.. కన్నవారికి కడుపుకోతను మిగిల్చింది.. చెరువులో ఈత కొడుదామని వెళ్లిన ఓ యువకుడు ప్రాణాలు కోల్పోయిన సంఘటన కె.నాయకంపల్లిలో జరిగింది. గండేపల్లి ఎస్సై వై.గణేష్‌కుమార్ కథనం ప్రకారం.. ప్రకాశం జిల్లా పచ్చవ గ్రామానికి చెందిన కోయి తరుణ్‌కుమార్ (21) గండేపల్లి మండలం సూరంపాలెంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంజినీరింగ్ చివరి సంవత్సరం చదువుతున్నాడు. ఆదివారం సెలవు కావడంతో తోటి స్నేహితులతో కలసి కె.నాయకంపల్లి పరిధిలోని తిమ్మరాజు చెరువు వద్దకు ఈత కొట్టేందుకు వెళ్లాడు. ఈ నేపథ్యంలో చెరువులో మునిగిపోయాడు. దీనిని గమనించిన స్నేహితులు బయటకు తీసి స్థానికంగా ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అతని పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం నిమిత్తం రాజమహేంద్రవరం తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుడి తండ్రి కృష్ణారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

తొర్రిగెడ్డ కాలువలో వ్యక్తి మృతదేహం

రాజానగరం: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధి కొంతమూరు తొర్రిగెడ్డ కాలువలో తుమ్మారి వెంకటేష్ (19) మృతదేహాన్ని పోలీసులు ఆదివారం కనుగొన్నారు. ఎస్సై సుధాకర్ కథనం ప్రకారం.. సీతానగరం మండలం ఉండేశ్వరపురానికి చెందిన వెంకటేష్ మెకానిక్ షెడ్‌లో పనిచేస్తున్నాడు. అతని జీతం డబ్బులు ఇంట్లో ఇవ్వడం లేదని తల్లి మందలించింది. దాంతో మనస్తాపం చెందిన అతను గత నెల 29న ఇంట్లో నుంచి బయటకు వెళ్లిపోయాడు. ఆదివారం తొర్రిగెడ్డ కాలువలో మృతదేహమై కనిపించాడు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

టీటీడీ సభ్యుడిగా 'పొన్నాడ' ప్రమాణ స్వీకారం



టీటీడీ పాలక మండలి సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేసిన ఎమ్మెల్యే పొన్నాడతో నాయకులు

ముమ్మిడివరం: తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి సభ్యుడిగా ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. ఇటీవల టీటీడీ నూతన పాలక మండలి సభ్యుల జాబితాను ప్రభుత్వం ప్రకటించింది. పాలక మండలి సభ్యుడిగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడను నియమిస్తూ ముఖ్యమంత్రి కార్యదర్శి కె.ధనుంజయరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్ తిరుపతిలో ప్రమాణ స్వీకారం చేశారు. ఆయనకు దేవస్థానం అధికారులు స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు. పాలక మండలి సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేసిన ఎమ్మెల్యేను పలువురు అభినందించారు. ఆయన వెంట ఆమె సతీమణి నీరజ, కుమారులు సుమంత్, రేవంత్, కుటుంబ సభ్యులు నాయకులు డిల్లీ నారాయణ, నేల కిశోర్, పిన్నమరాజు శ్రీనురాజు, యానాం రామూర్తి తదితరులు ఉన్నారు.

నిందితుల ఆచూకీ కోసం జల్లెడ

- మరో ఏడు పోలీసు బృందాల ఏర్పాటు
- దుకాణం దహనం, ఇల్లు ధ్వంసంపై కేసుల నమోదు
- అమలాపురంలో కొనసాగుతున్న పోలీసు పహారా

అమలాపురం టౌన్: ఈదరపల్లిలో రౌడీ షీటర్ హత్య, మరో వ్యక్తిపై హత్యాయత్నం కేసులను జిల్లా పోలీసు శాఖ సీరియస్‌గా తీసుకుంది. హత్య, హత్యాయత్నం చేసి పరారీలో ఉన్న రౌడీషీటర్ ఆనంద్, అతని అనుచరులు సతీష్, సుధీర్, ఇంద్ర తదితరుల ఆచూకీ కోసం పోలీసు ప్రత్యేక బృందాలను మరిన్ని పెంచి ఉభయ రాష్ట్రాల్లోని ముఖ్య నగరాల్లో గాలిస్తున్నారు. హత్య జరిగిన రోజు రెండు పోలీసు బృందాలను సెర్చ్ పార్టీలుగా నియమిస్తే వాటిని మరో ఏడుకు పెంచి మొత్తం 9 బృందాలను రంగంలోకి దింపారు. రౌడీషీటర్ పోలిశెట్టి కిషోర్ హత్య, అతని సహచరుడు అడపా సాయి లక్ష్మణ్‌పై హత్యాయత్నం చేసిన ఘటనను నిరసిస్తూ వారి వర్గీయులు ప్రత్యర్థులకు చెందిన ఇద్దరి ఆస్తుల విధ్వంసానికి దిగిన సంగతి తెలిసిందే. టీడీపీ నాయకుడు, మాజీ రౌడీషీటర్ గంధం పల్లంరాజుకు చెందిన అమలాపురం ఎర్ర వంతెన వద్ద గల సప్తగిరి అపార్ట్‌మెంట్స్‌లోని దుకాణం దహనం, ఈదరపల్లిలో బళ్ల సతీష్ ఇంటిని ధ్వంసం చేసిన ఘటనలపై అందిన ఫిర్యాదులతో పట్టణ పోలీసులు రెండు కేసులు నమోదు చేశారు. 400 మంది పోలీసులతో పహారా ఆదివారం కూడా కొనసాగింది. హత్యకు పాల్పడ్డారన్న ఆరోపణలపై బాధిత వర్గం నుంచి నిందితుల ఇళ్ల వద్ద దాడులు, ధ్వంసాలకు అవకాశం లేకుండా పోలీసు పికెట్లు కూడా కొనసాగుతున్నాయి. మొత్తం 15 పోలీసు పికెట్లతో ముఖ్య కూడళ్లతో పాటు నిందితుల ఇళ్ల వద్ద బందోబస్తు నిర్విరామంగా నిర్వహిస్తున్నారు. వారి ఇళ్లపైనే కాకుండా సెల్‌ఫోన్ల ట్రాకింగ్‌పై కూడా నిఘా పెట్టారు. వారి స్నేహితుల కదలికలపై కన్నేసి ఉంచారు.

మరోసారి డీఐజీ సమీక్ష

హత్య జరిగినప్పటి నుంచీ ఏలూరు రేంజ్ డీఐజీ అశోక్‌కుమార్ అమలాపురంలోనే మకాం ఉండి శాంతి భద్రతల పరిరక్షణకు చర్యలు చేపడతున్నారు. డీఐజీతో పాటు జిల్లా ఎస్పీ సుసరాపు శ్రీధర్, పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పీ రవిప్రకాష్‌లు కూడా ఎప్పటికప్పుడు పరిస్థితిని అమలాపురంలోని జిల్లా ఎస్పీ కార్యాలయం నుంచి సమీక్షిస్తున్నారు. ఇప్పటికే పలు దఫాలుగా సమీక్షలు చేసిన డీఐజీ ఆదివారం ఉదయం కూడా ఎస్పీలు, జిల్లాలోని డీఎస్పీలు, సీఐలతో నిర్వహించిన సమీక్షలో జరిగిన ఘటనపై లోతుగా చర్చించారు. రౌడీ షీటర్లను అదుపు చేయడంలో జరిగిన లోపాలపై ఆయన చర్చించి సీరియస్ అయినట్లు తెలిసింది. రౌడీ షీటర్లను పోలీస్ స్టేషన్లకు పిలిపించి సీరియస్‌గా కౌన్సెలింగ్‌లు, వార్నింగ్‌లు ఇస్తున్నారు.

నిరంతరాయంగా విద్యుత్తు సరఫరా

- ముఖ్యమంత్రి ఆదేశాలతో చర్యలు
- ఏపీఈపీడీసీఎల్ పర్యవేక్షక ఇంజినీర్ మూర్తి

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు గృహ, వ్యవసాయ విద్యుత్తు వినియోగదారులకు నిరంతరాయంగా విద్యుత్తు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని రాజమహేంద్రవరం ఏపీఈపీడీసీఎల్ పర్యవేక్షక ఇంజినీర్ (ఆపరేషన్స్) టీవీఎస్ఎన్ మూర్తి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో భాగంగా పరిశ్రమల విద్యుత్ వినియోగంపై పరిమితులు విధించి గృహ వినియోగానికి నిరంతరం, వ్యవసాయానికి తొమ్మిది గంటలు నిరంతరాయంగా 3–ఫేజ్ సరఫరా చేస్తామన్నారు. ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ ఆదేశాల మేరకు లోడు నియంత్రిస్తామని అన్నారు. ప్రస్తుతం వినియోగదారులకు ఎటువంటి విద్యుత్ కోతలు లేవని పేర్కొన్నారు. పరిశ్రమలకు పవర్ హాలిడే వారంలో ఒక రోజు డివిజన్ వారీగా అమలు చేస్తామన్నారు. సోమవారం జగ్గంపేట డివిజన్, మంగళవారం కాకినాడ డివిజన్, బుధవారం పెద్దాపురం డివిజన్, గురువారం రాజమహేంద్రవరం రూరల్ డివిజన్, శుక్రవారం అమలాపురం డివిజన్, రంపచోడవరం డివిజన్, శనివారం రాజమహేంద్రవరం అర్బన్ డివిజన్, రామచంద్రపురం డివిజన్లలో పవర్ హాలిడే పాటించాలన్నారు.

డివిజన్ స్థాయి అధికారుల ఫోన్ నంబర్లు

రాజమహేంద్రవరం సర్కిల్ ఆఫీస్	– 73822 99960
రాజమహేంద్రవరం టౌన్ డివిజన్	– 94408 12585
రాజమహేంద్రవరం రూరల్ డివిజన్	– 73825 85487
కాకినాడ డివిజన్	– 94408 12586
పెద్దాపురం డివిజన్	– 83338 18099
జగ్గంపేట డివిజన్	– 94408 12589
అమలాపురం డివిజన్	– 94408 12588
రామచంద్రపురం డివిజన్	– 94408 12587
రంపచోడవరం డివిజన్	– 73825 85554

కవులకు సాహితీ కళాపీఠం ఆహ్వానం




అంబాజీపేటలో సాహితీ కళాపీఠం కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కళాకారులు

అంబాజీపేట: కళారంగంలో ప్రతిభ కలిగి, ఆర్థిక వెనుకబాటు కలిగిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన కవులను గుర్తించి అవార్డులు ప్రదానం చేసేందుకు అరిగెల బలరామమూర్తి సాహితీ కళాపీఠం ఆహ్వానిస్తోందని కళాపీఠం వ్యవస్థాపకుడు అరిగెల బలరామమూర్తి తెలిపారు. ఆదివారం అంబాజీపేట బస్టాండ్ ఎదురుగా ఉన్న కళాపీఠం కార్యాలయంలో సాహితీ, కళాపీఠం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాస్య ప్రధానమైన కవితలు 20 లైన్లకు మించకుండా ఉండాలని, వాటిని ఈ నెల 5 నుంచి అక్టోబర్ 15 వరకూ పోస్ట్ ద్వారా గాని, స్వయంగా గాని అందజేయాలన్నారు. కవితతో పాటు, హామీ పత్రం, కవి ఫోటో జతపర్చాలన్నారు. అక్టోబర్ చివరిలో ఉత్తమ కవితలను ఎంపిక చేసి, నవంబర్‌లో బహుమతుల ప్రదానం చేస్తామన్నారు. హాస్య కవితలలో ప్రథమ స్థానం పొందిన వారికి రూ.5,116 నగదు బహుమతితో పాటు అవార్డు ప్రదానం, సన్మానాలు చేస్తామని బలరామమూర్తి తెలిపారు. కార్యక్రమంలో నల్లా నరసింహమూర్తి, పరసా సుబ్బారావు, బీవీవీ సత్యనారాయణ, అరిగెల వెంకటేశ్వరరావు, శ్రీపాద రామకృష్ణ, గాదరాడ రవిచంద్ర, ఏడిద కవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

రాంగ్ రూట్‌లో వెళ్లొద్దు

- ప్రమాదాలు కొనితెచ్చుకోవద్దు
- ట్రాఫిక్ డీఎస్పీ వెంకటేశ్వర్లు



రోడ్డు భద్రతపై చేపట్టాల్సిన చర్యలను వివరిస్తున్న ట్రాఫిక్ డీఎస్పీ వెంకటేశ్వర్లు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): రహదారులపై రాంగ్ రూట్‌లో వెళ్లి ప్రమాదాలు కొనితెచ్చుకోవద్దని ట్రాఫిక్ డీఎస్పీ ఎం.వెంకటేశ్వర్లు తెలిపారు. ఇన్‌చార్జ్ ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు స్థానిక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ విభాగాలకు చెందిన సీఐలు, ఎస్సైలతో ఆదివారం ఆయన రోడ్డు భద్రతపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. మూడు నెలల కాలంలో జరిగిన రోడ్డు ప్రమాదాల నివేదిక తీసుకుని ఆ ప్రాంతాల్లో రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ప్రమాదాలకు నెలవుగా ఎన్ని బ్లాక్ స్పాట్లు ఉన్నాయో గుర్తించాలన్నారు. హైవేలపై వెళ్తున్న లారీలను ఆపి డ్రైవర్లకు రోడ్డు భద్రతపై కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు. డివైడర్లు దాటకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు చేపట్టాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని ఎంత చెబుతున్నా తల్లిదండ్రులు వినడం లేదని, వాహనాలు ఇచ్చిన యజమానులపై కేసులు నమోదు చేయాలన్నారు. అలాగే ట్రిబుల్ రైడింగ్ నిరోధించాలన్నారు. సమావేశంలో టూ టౌన్ సీఐ టి.గణేష్, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

PLOT FOR SALE

■ రాజమండ్రి దివాన్ చెరువులో D.V.B.రాజు గారి లే-అవుట్‌లో East & West Facing Plots 10 అమ్మకమునకు కలవు. చ॥గ॥ 6 వేలు నుండి 18 వేలు మాత్రమే. సంప్ర॥ ✆ : 94919 13458 [R-1171874]

■ కాకినాడ, భానుగుడి, 80 అ॥లు మిలట్రీ రోడ్డులో దక్షిణం, స్మార్ట్ సిటీ 80 అ॥లు రోడ్డులో E/F కమర్షియల్ స్థలములు, శ్రీనగర్, వెంకట్‌నగర్, శాంతినగర్‌లలో కలవు. పి.ఎ.స్వామి, సంప్ర॥ 98481 07949 [R-63]

SITE FOR SALE

■ రాజమండ్రి ఈస్ట్ రైల్వేస్టేషన్ ఆవరోడ్‌లో పడమర ఫేసింగ్ 1200 గజములు అమ్మకమునకు కలదు. ✆ : 93478 84318 [R-0]

Services

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో ఇతర సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం అధిక ధరకు కొనబడును. (స్పాట్ క్యాష్) ✆ 88024 89999 [B-6053]

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 91699 22299

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) 100% జెన్యూన్. ✆ 76508 91999 [B-788217]

అమ్మ హోంకేర్ సర్వీస్

■ వృద్ధులకు సేవచేయుటకు, చిన్నపిల్లలను చూసుకొనుటకు వంట పనికోసం పనిచేయుటకు మగ/ఆడ వారు కావలెను. పర్మనెంట్ మంచి జీతం. ఏజెంట్లకు కమీషన్ ఇవ్వబడును. 9059835761, 8522903927. [W-1229406]

Wanted

■ కాకినాడ చర్చిలో పనిచేయుటకు మగ సెక్షన్ కావలెను. తెలుగు బాప్టిస్ట్ సంఘము, ఎల్విన్ పేట, గాంధీనగర్ పోస్టాఫీస్ ప్రక్కన, కాకినాడ. ✆ : 83411 51033, 99635 54688 [R-1234047]

■ రాజమండ్రి, కొంతమూరు, నామవరంలో ప్ర॥ కం॥ ATMs, షోరూమ్స్, స్టార్ హోటల్స్ నందు సెక్యూరిటీ గార్డ్స్, సె॥ సూపర్‌వైజర్స్ కావలెను. జీ॥12 to 15 వేలు. రూం+భో. రాజ్ సెక్యూరిటీ, దేవిచౌక్, రాజమండ్రి. 93922 69369 [R-90]

■ హైదరాబాద్ స్టార్ హోటల్స్‌లో ఫుడ్ సర్వీస్‌కి క్యాటరింగ్ బాయ్స్ కావలెను. రూమ్+ఫుడ్ ఫ్రీ. జీతం: 18000-24000/- స్వా, జా॥ Ph: 9381979061 [HA-2081]

■ హైదరాబాదులో అపొలో ఎల్డర్‌కేర్‌లో ఉద్యోగ అవకాశం. M/F కేర్ టేకర్స్ కావలెను. Age 21-45 వేలు జీతం: 15 వేలు ఆపైన, భోజన వసతి ఇన్సూరెన్స్ సౌకర్యం కలవు. ఆసక్తి కలవారు సంప్ర॥ 81066 28388 [G-1112]

■ కన్సల్టెన్సీ కాదు. VIPఇంట్లోపెద్దవాళ్ళని చూసుకోవడానికి M/F ఆయా, నర్సులు, వంట చేయువారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 12000-35000/- ఫ్రీ రూమ్+ భోజనం. Hyd. ఫోన్ : 9391753308. [HA-576]

■ శ్రీసాయిరాం హోమ్‌కేర్ Hydలో శ్రీమంతుల ఇండ్లలో ఇంటిపని వంటపని, వృద్ధులను, చిన్న పిల్లలను చూసు కొనుటకు స్త్రీ/పు.కావలెను. జీతం: 18000/- ఏజెంట్ కమీషన్ 7K. 9666001826, 9666001827 [H-189392]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి+ భోజనం, జీ: 18K. ఏజెంట్ కమీషన్ 3K. ఫోన్ : 9848571888 [HA-569]

■ మా సంస్థలో పర్మినెంట్‌గా జాబ్ చేయుటకు 25 సం॥లోపు యువతీ యువకులు కావలెను. రూంఫ్రీ. ట్రైనింగ్ తరువాత 14,000/- ఆ పైన. ఫోన్ : 90526 23478, 94942 66782 [V-5921]

■ గుంటూరు హోమ్ హెల్త్ కేర్ సర్వీసెస్. శ్రీమంతుల ఇళ్ళలో పేషెంట్స్‌ను చూసుకొనుటకు ఆడ మగ స్టాఫ్ కావలెను. జీ: 15000/- to 25,000/- ఫ్రీఫుడ్+రూమ్. 9392442511, 8142767696 [G-751545]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.